క్లుప్తంగా

విద్యుత్ ఏఈగా బాధ్యతల స్వీకరణ


ఏఈ కళ్యాణి

తిరుమలగిరి(నాగార్జునసాగర్): తిరుమలగిరి(సాగర్) మండల విద్యుత్ శాఖ నూతన ఏఈగా కళ్యాణి మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. నాగార్జునసాగర్‌లో పనిచేస్తున్న ఈమె బదిలీపై ఇక్కడికి వచ్చారు. ఈ సందర్భంగా ఏఈ కళ్యాణి మాట్లాడుతూ అన్ని గ్రామాల్లో ఉన్న లైన్‌మెన్లు, ఇతర సిబ్బంది సమన్వయ సహకారంతో పకడ్బందీగా సేవలందించడానికి కృషి చేస్తానని తెలిపారు. ఈ సందర్భంగా సహచర ఉద్యోగులు శుభాకాంక్షలు తెలిపారు.

విద్యార్థులకు షూ పంపిణీ


షూ పంపిణీ చేస్తున్న మాజీ వైస్ ఎంపీపీ దిలీప్‌కుమార్‌రెడ్డి

హాలియా : మండలంలోని కొత్తపల్లి ప్రాథమిక స్కూల్ విద్యార్థులకు బుసిరెడ్డి ఫౌండేషన్ చైర్మన్ పాండురంగారెడ్డి సహకారంతో ఏర్పాటు చేసిన షూ లను మంగళవారం తిరుమలగిరి(సాగర్) మండల మాజీ వైస్ ఎంపీపీ యడవెల్లి దిలీప్ కుమార్ రెడ్డి పంపిణీ చేసి మాట్లాడారు. ఇలాంటి సేవ కార్యక్రమాలను మరిన్ని చేపట్టి ప్రజల ఆదరాభిమాలను చూరగొనలన్నారు. ఈ కార్యక్రమం లో తిరుమలనాథ గుడి మాజీ చైర్మన్ బుర్రి రాంరెడ్డి, ప్రధానోపాధ్యాయుడు వెంకన్న, సీనియర్ ఉపాధ్యాయులు సైదులు, ప్రశాంత్, ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పోలీస్ స్టేషన్ భవనం పరిశీలన


స్టేషన్ ఎదుట సీసీ పనులు పరిశీలిస్తున్న డీఎస్పీ రాజశేఖర్‌రాజు

నిడమనూరు : నిడమనూరు పోలీస్ స్టేషన్ శిథిలావస్థ చేరడంతో నూతన భవనంలోకి మార్చుతున్నారు. స్థానిక మండల పరిషత్ కాంప్లెక్స్ భవనాన్ని మిర్యాలగూడ డీఎస్పీ రాజశేఖర్‌రాజు మంగళవారం పరిశీలించారు. కొత్త భవనంలో రిసెప్షన్ సెంటర్, కంప్యూటర్ గది, లాకప్ రూం, వంటి సౌకర్యాలపై డీఎస్పీ పలు సూచనలు చేశారు. స్టేషన్ భవనం చుట్టూ చేపట్టిన సీసీ పనులను పరిశీలించారు. డీఎస్పీ వెంట సీఐ సతీష్‌రెడ్డి, ఎస్ఐ ఉప్పు సరేష్ ఉన్నారు.

విద్యార్థినికి ఆర్థికసాయం


ఆర్థికసాయం అందజేస్తున్న ట్రస్ట్ సభ్యులు

మిర్యాలగూడ : దామరచర్ల మండలంలోని వీర్లపాలెం గ్రామానికి చెందిన పానుగోతు సైదానాయక్, సునీత దంపతుల కుమార్తె ధనలక్ష్మి ఇటీవల జేఈఈ మెయిన్స్ పుదుచ్చేరి యూనివర్సిటీలో కంప్యూటర్ సైన్స్ సీటు సాధించింది. ధనలక్ష్మితండ్రి సైదానాయక్ రోజువారీ కూలి కావడంతో ధనలక్ష్మి ఉన్నత చదువులకు ఇబ్బందులు పడుతోంది. దీంతో హైదరాబాద్ హార్ట్ టు హెల్ప్ ట్రస్ట్ ఫౌండర్ ముడె రవినాయక్ స్పందించి మంగళవారం దాత అసిస్టెంట్ ఇంజనీర్ విద్యుత్‌శాఖ జి.స్వప్న ద్వారా రూ.15వేలు ఆర్థిక సాయం అందించారు. కార్యక్రమంలో భరత్, కరుణాకర్, మహేష్ పాల్గొన్నారు.

డిండి: మండల పరిధిలోని తవక్లాపూర్ గ్రామానికి చెందిన వంకేశ్వరం అంతమ్మ, ఎలిమినేటి ఎల్లమ్మ, కుర్మేటి తిర్పతయ్య, చెనమోని సుభద్ర వివిధ కారణాలతో ఇటీవల మృతి చెందారు. మంగళవారం అదే గ్రామానికి చెందిన బీఆర్ఎస్ మండల నాయకుడు పొన్నగంటి కృష్ణయ్య మృతుల కుటుంబ సభ్యులకు ఒక్కొక్కరికి రూ. 3 వేల చొప్పున మొత్తం రూ.12 వేలు ఆర్థికసాయంగా అందజేశారు.

ప్రభుత్వ పాఠశాలలో మెనూ పాటించాలి

చందంపేట: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు ప్రభుత్వం అందించే విధంగా మెనూ పాటించాలని దేవరకొండ ఆర్డీవో రమణారెడ్డి సూచించారు. మంగళవారం నేరెడుగొమ్ము మండల కేంద్రంలోని కస్తూర్బా పాఠశాలను ఆయన సందర్శించి వంట గదిని, పరిసరాలను పరిశీలించి పలు సూచనలు చేశారు. అనంతరం నేరెడుగొమ్ము తహశీల్దార్ కార్యాలయాన్ని సందర్శించి భూ భారతి దరఖాస్తులకు సంబంధించి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని సూచించారు. ఆర్డీవో వెంట తహశీల్దార్ ఉమాదేవి, హరీష్ తదితరులున్నారు.

సర్కార్ ఇసుక.. టన్ను రూ.1250

- మిర్యాలగూడలో సాండ్ బజార్ ఏర్పాటు
- ఇసుక బ్లాక్ మార్కెట్‌కు ఇక స్వస్తి
- ప్రభుత్వానికి పెరగనున్న ఆదాయం
- రేపటి నుంచి అమ్మకాలు ప్రారంభం


ఇసుక డంప్‌ను పరిశీలిస్తున్న సబ్ కలెక్టర్ నారాయణ్‌అమిత్

మిర్యాలగూడ : ప్రభుత్వమే ఇసుక అమ్మకానికి పూనుకుంది. ఉమ్మడి నల్లగొండ జిల్లాలో మొదటిసారిగా మిర్యాలగూడలో సాండ్ బజార్ ఏర్పాటు చేసింది. మైనింగ్‌శాఖ పర్యవేక్షణలో ఈ సాండ్ బజార్ ద్వారా వినియోగదారులకు ఇసుక అందుబాటులోకి తెస్తోంది. మిర్యాలగూడ శివారులోని చింతపల్లి బైపాస్ వద్ద ఖాళీ స్థలంలో సాండ్ బజార్ ఏర్పాటు చేసింది. ఈ సాండ్ బజార్‌ను ఈనెల 7న తెలంగాణ మైనింగ్ శాఖ మేనేజింగ్ డైరెక్టర్ భవిష్‌మిశ్రా ప్రారంభించనున్నారు. ఇక్కడ టన్ను ఇసుక రూ.1250కే విక్రయించనున్నారు.

తక్కువ ధరకే ఇసుక లభ్యం..

శాలిగౌరారం మండలం వంగమర్తి నుంచి ప్రత్యేకంగా లారీల్లో ఇసుకను ఇక్కడికి తీసుకొచ్చి సాండ్ బజార్‌లో డంప్ చేసి విక్రయిస్తారు. సాండ్ బజార్ ఏర్పాటుతో ఇసుక బ్లాక్ మార్కెట్‌కు తరలివెళ్లే అవకాశం తగ్గిపోతుంది. దీంతో వినియోగదారులకు తక్కువ ధరలకే ఇసుక లభించనుంది. 'మన ఇసుక- మన వాహనం పథకం' కూడా అమల్లో ఉంటుంది. ఆన్‌లైన్ ఇసుక బుక్ చేసుకున్నట్లయితే ఆయా రీచ్‌ల ద్వారా వినియోగదారులకు ఇసుక అందించనున్నారు. ఇప్పటికే రాష్ట్రంలో ఆయా జిల్లాల్లో ఈ ఇసుక బజార్ ఏర్పాటు చేశారు. దీని ద్వారా మంచి ఫలితాలు రావడం, ప్రభుత్వానికి ఇసుక ఆదాయం పెరగడంతో ఉమ్మడి నల్లగొండ జిల్లాలో తొలిసారిగా మిర్యాలగూడలో కూడా సాండ్ బజార్‌ను ఏర్పాటు చేశారు.

రవాణా చార్జీలు భరించాలి..

సాండ్ బజార్‌లో ఇసుక టన్నుకు రూ.1.250 చొప్పున విక్రయించనున్నారు. శాలిగౌరారం మండలం వంగమర్తి నుంచి లారీల ద్వారా నేరుగా ఇక్కడికి ఇసుక రాగా దాన్ని ఇక్కడ వినియోగదారులకు విక్రయిస్తారు. ఒక ట్రాక్టర్‌లో 3 టన్నుల ఇసుక పట్టడంతో ఇసుక ట్రాక్టర్ రూ.37.50 ధర పడనుంది. అదే లారీలో అయితే 11 నుంచి 13టన్నుల ఇసుక పడుతుంది. రూ.13.750 నుంచి రూ.16.250 ధరకు లభిస్తుంది. రవాణా చార్జీలు వినియోగదారులే భరించాలి. సాండ్ బజార్‌లో ఇసుకను వాహనంలో నింపే బాధ్యత నిర్వాహకులదే. కానీ అక్కడి నుంచి పని ప్రదేశం వరకు వినియోగదారులు రవాణా చార్జీలు భరించాలి.

తక్కువ ధరకు సిమెంట్ కూడా..

మిర్యాలగూడ నియోజకవర్గంలో మొత్తం ఐదు వేల ఇందిరమ్మ ఇళ్లు మంజూరయ్యాయి. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి తక్కువ ధరకు సిమెంట్ అందించాలని స్థానిక ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి ఇటీవల అల్ట్రాటెక్ సిమెంట్ పరిశ్రమ ప్రతినిధులతో సమావేశమయ్యారు. ధర తగ్గింపు విషయాన్ని కంపెనీ యాజమాన్యం దృష్టికి తీసుకెళ్తామని ప్రతినిధులు ఎమ్మెల్యేకు హామీ ఇచ్చారు. దీంతో సిమెంట్ కూడా ఇందిరమ్మ లబ్ధిదారులకు తక్కువ ధరకే అందనుంది. ఈ సిమెంట్ కూడా సాండ్ బజార్ ద్వారానే ఇందిరమ్మ లబ్ధిదారులకు విక్రయించాలని నిర్ణయించారు. ఇందిరమ్మ లబ్ధిదారులకు కొంత ఆర్థిక వెసులుబాటు కలగనుంది.

సాండ్ బజార్‌ను సద్వినియోగం చేసుకోవాలి



మిర్యాలగూడలో ఏర్పాటు చేసిన సాండ్ బజార్‌ను వినియోగదారులు సద్వినియోగం చేసుకోవాలి. అవసరమైన వారు ప్రభుత్వం నిర్ణయించిన ధరకు ఇసుకను కొనుగోలు చేయవచ్చు. ఈ సాండ్ బజార్ ద్వారా ప్రభుత్వానికి ఆదాయంతోపాటు ఇసుక బ్లాక్ మార్కెట్ తగ్గి వినియోగదారులకు సులభంగా ఇసుక దొరుకుతుంది. త్వరలోనే సిమెంట్ కూడా కంపెనీ ధరకే ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు అందించాలని ఆలోచిస్తున్నాం. ఇప్పటికే సిమెంట్ పరిశ్రమ ప్రతినిధులతో చర్చించాం. త్వరలోనే సిమెంట్ తక్కువ ధరకు అందించేలా చర్యలు తీసుకుంటాం.

– నారాయణ్ అమిత్, సబ్ కలెక్టర్, మిర్యాలగూడ

పేదలందరికీ సంక్షేమ పథకాలు : ఎమ్మెల్యే


గాంధీనగర్‌లో మాట్లాడుతున్న ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి

మిర్యాలగూడ : అర్హులైన పేదలందరికీ ప్రభుత్వం సంక్షేమ పథకాలు అందిస్తామని ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి అన్నారు. మంగళవారం మిర్యాలగూడ పట్టణంలోని గాంధీనగర్ 35వ వార్డులో 18 నెలలు, 18 పథకాలు, 18రోజుల కార్యక్రమంలో భాగంగా స్థానికులకు కరపత్రాలు అందించి మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం గడిచిన 18 నెలల కాలంలోనే అనేక సంక్షేమ పథకాలు అమలు చేసిందన్నారు. కార్యక్రమంలో కొమ్ము శ్రీనివాస్, దైద కాశయ్య, గూడపూరి శ్రీనివాస్, శ్రవణ్‌కుమార్, ఊర రామకృష్ణ, శివమణి, రాజా, శివ, అరవింద్, రఘు తదితరులు పాల్గొన్నారు.

డ్రగ్స్ నిర్మూలనలో భాగస్వాములు కావాలి


మాట్లాడుతున్న సీఐ బీసన్న

డిండి : డ్రగ్స్ నిర్మూలనలో ప్రతిఒక్కరూ భాగస్వాములు కావాలని డిండి రూరల్ సీఐ.బీసన్న కోరారు. మంగళవారం మండల పరిధిలోని గోనబోయనపల్లిలో డ్రగ్స్, నేరాల నివారణపై ప్రజలకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ.. యువత చెడు వ్యసనాలకు బానిసై జీవితాలను నాశనం చేసుకోవద్దన్నారు. కాగా, డ్రగ్స్ వాడకంతో కలిగే దుష్పరిణామాలు, నేరాల నివారణ చర్యలను పోలీసులు ఎల్ఈడీ స్క్రీన్‌పై ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ.బాలకృష్ణ, గ్రామ పోలీసు అధికారి ఉస్సేన్, యువకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే చర్యలు


మాట్లాడుతున్న సీఐ వెంకట్‌రెడ్డి

దేవరకొండ : శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే చట్టరీత్యా చర్యలు తప్పవని దేవరకొండ సీఐ వెంకట్‌రెడ్డి అన్నారు. మంగళవారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పట్టణంలో ఎవరైన అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడితే ఉపేక్షించేది లేదన్నారు. మత్తు పదార్థాల వినియోగం, ర్యాగింగ్, ర్యాష్ డ్రైవింగ్, గ్రూపు తగాదాలు వంటి వాటిపై ఎస్పీ ఆదేశాల మేరకు ప్రత్యేక దృష్టి సారించినట్లు తెలిపారు. ముఖ్యంగా పట్టణంలోని ప్రధాన రహదారులతో పాటు విద్యాసంస్థల వద్ద పోలీసులు మఫ్టీలో ఉండి ఆకతాయిల ఆగడాలకు అడ్డుకట్ట వేసేందుకు ప్రత్యేక కార్యాచరణ రూపొందించినట్లు తెలిపారు. బహిరంగ ప్రదేశాల్లో సైతం మద్యం సేవించే వారిపై చర్యలు తప్పవన్నారు. త్వరలోనే దేవరకొండ పట్టణంలో నూతనంగా మరో 80సీసీ కెమెరాలను ఏర్పాటు చేసి వాటిని స్టేషన్‌లోని కమాండ్ కంట్రోల్ రూమ్‌కు అనుసంధానం చేసి ఎప్పటికప్పుడు పర్యవేక్షించనున్నట్లు తెలిపారు. మత్తు పదార్థాల వినియోగంపై ఉక్కుపాదం మోపనున్నట్లు తెలిపారు. శాంతి భద్రతల పరిరక్షణకు ప్రతి ఒక్కరూ పోలీసులకు సహకరించాలని ఆయన కోరారు. ఈ సమావేశంలో సిబ్బంది ఉన్నారు.

తల్లిపాలతోనే రోగ నిరోధక శక్తి


చందంపేట : తల్లిపాల వారోత్సవాల్లో పాల్గొన్న ఐసీడీఎస్ సూపర్‌వైజర్ శోభారాణి, అంగన్‌వాడీలు

మిర్యాలగూడ టౌన్ : పుట్టిన బిడ్డకు గంటలోపు తల్లిపాలు పట్టిస్తేనే బిడ్డకు వ్యాధి నిరోధక శక్తి పెరుగుతుందని డిప్యూటీ డీఎంహెచ్‌ఓ కేసా రవి అన్నారు. మంగళవారం మిర్యాలగూడ మండలం అలగడప ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వద్ద, మిర్యాలగూడలోని షాబునగర్, రెడ్డికాలనీ, హనుమాన్‌పేట అంగన్‌వాడీ కేంద్రాల వద్ద ఐసీడీఎస్ ఆధ్వర్యంలో తల్లిపాల వారోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పుట్టిన బిడ్డకు ముర్రు పాలు తాపించే దిశగా అంగన్‌వాడీ టీచర్లు, ఆశా వర్కర్లు ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. తల్లి బిడ్డ ఆరోగ్యం కోసం అందరూ కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో డాక్టర్ మొయిద్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు రాధిక, నాగమణి, నజిమాబేగం, పీహెచ్‌ఎన్ స్వరూపారాణి, హెల్త్ సూపర్‌వైజర్ మంగమ్మ, శివలీల, మాధవి, లత, సంధ్య, రమాదేవి విజయ, సరిత తదితరులు ఉన్నారు.

పెద్దమునిగల్‌లో తల్లిపాలపై అవగాహన

చందంపేట : పుట్టిన శిశువుకు తల్లిపాలు శ్రేష్ఠమైనవని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ శోభారాణి అన్నారు. మంగళవారం నేరెడుగొమ్ము మండలంలోని పెద్దమునిగల్ గ్రామంలో తల్లిపాలపై అవగాహన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పుట్టిన శిశువుకు ఆరు నెలల వరకు తల్లిపాలు తాగించాలని సూచించారు. అంతకుముందు అవగాహన ర్యాలీ చేపట్టారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు అరుణ, సువార్త, గర్భిణులు, బాలింతలు పాల్గొన్నారు.

భార్యతో గొడవపడి ఇంట్లో నుంచి వెళ్లిపోయిన భర్త


మాలె రాంరెడ్డి

తిరుమలగిరి(నాగార్జునసాగర్): భార్యతో గొడవపడి భర్త ఇంట్లో నుంచి వెళ్లిపోయాడు. ఈ ఘటన తిరుమలగిరి(సాగర్) మండలం అల్వాల గ్రామంలో జరిగింది. ఎస్ఐ వీరశేఖర్ తెలిపిన వివరాల ప్రకారం.. తమ పొలాన్ని కౌలుకు ఇచ్చేద్దామని అల్వాల గ్రామానికి చెందిన మాలె రాంరెడ్డిని సోమవారం అతడి భార్య గీత కోరింది. అతడు వద్దని ఆమెతో గొడవ పడ్డాడు. దీంతో గీత ఇంట్లో నిద్రిస్తుండగా.. ఇంటి తలుపునకు బయట నుంచి గడియ పెట్టి ఎవరికీ చెప్పకుండా రాంరెడ్డి ఇంట్లో నుంచి వెళ్లిపోయాడు. కొంత సమయం తర్వాత నిద్ర లేచిన రాంరెడ్డి భార్య గీత బయట నుంచి గడియ పెట్టి ఉండటం, బైక్, తన భర్త లేకపోవడం గమనించి పరిసర ప్రాంతాల్లో వెతుకుతుండగా.. తమ పొలం వద్ద బైక్ కనిపించింది. దీంతో తన భర్త కనిపించడం లేదని మంగళవారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో గీత ఫిర్యాదు చేసింది. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు. రాంరెడ్డి ఆచూకీ తెలిసినవారు 8712670199 నంబర్‌కు సమాచారం అందించాలని సూచించారు.

విద్యార్థులకు నాణ్యమైన విద్యనందించాలి


విద్యార్థినులతో మాట్లాడుతున్న జీసీడీఓ

మాడుగులపల్లి : ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించాలని జీసీడీఓ అరుంధతి అన్నారు. మంగళవారం మాడ్గులపల్లి కేజీబీవీని ఆమె ఆకస్మికంగా సందర్శించి రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా తరగతి గదులను పరిశీలించి విద్యార్థులను పలు ప్రశ్నలు వేసి సమాధానాలు రాబట్టారు. అనంతరం పాఠశాల ఆవరణ, వంటగదిని పరిశీలించి మాట్లాడారు. చదువులో వెనుకబడిన విద్యార్థులపై ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. ఈనెలలోనే కేజీబీవీ నూతన భవనాన్ని ప్రారంభించేలా కృషి చేస్తానన్నారు. ఆమె వెంట ఎస్ఓ సునీత, ఉపాధ్యాయులు ఉన్నారు.

రాష్ట్ర స్థాయి అథ్లెటిక్స్‌కు విద్యార్థి ఎంపిక


విద్యార్థి పవన్‌కుమార్‌ను అభినందిస్తున్న ప్రిన్స్‌పాల్ రవీందర్

హాలియా : ఆగస్టు 6, 7వ తేదీల్లో జనగాం జిల్లాలో నిర్వహించే రాష్ట్రస్థాయి అథ్లెటిక్ ఛాంపియన్ షిప్ పోటీలకు స్థానిక ఆకాంక్ష స్కూల్‌కు చెందిన విద్యార్థి ఆర్ పవన్ కుమార్ ఎంపికైనట్లు ఆ పాఠశాల ప్రిన్స్‌పాల్ మోదాల రవీందర్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. జూలై 20న నల్లగొండ జిల్లా కేంద్రంలోని మేకల అభినవ్ స్టేడియంలో నిర్వహించిన జిల్లాస్థాయి అథ్లెటిక్ ఛాంపియన్ షిప్ పోటీల్లో తమ పాఠశాలకు చెందిన విద్యార్థి పవన్ కుమార్ పాల్గొని 600 మీటర్స్ విభాగంలో అత్యుత్తమ ప్రతిభ కనబర్చి రాష్ట్రస్థాయి అథ్లెటిక్ ఛాంపియన్ షిప్‌కు ఎంపికైనట్లు తెలిపారు. విద్యార్థి పవన్‌కుమార్‌ను పాఠశాల కరస్పాండెంట్ మేడేపల్లి మోహన్‌రావు, డైరెక్టర్ ఉన్నం శ్రీనుబాబు, పీఈటీ ఆవుల చంద్రశేఖర్, ఉపాధ్యాయులు అభినందించారు.

ప్రభుత్వ కళాశాలలను సద్వినియోగం చేసుకోవాలి


సాగర్‌లో అధ్యాపకులతో భీంసింగ్

నాగార్జునసాగర్ : ప్రభుత్వ జూనియర్ కళాశాలలను సద్వినియోగం చేసుకోవాలని ఇంటర్మీడియట్ విద్యా జాయింట్ సెక్రటరీ ఎల్.భీంసింగ్ అన్నారు. మంగళవారం నందికొండ మున్సిపాలిటీ పరిధిలో హిల్‌కాలనీ ప్రభుత్వ జూనియర్ కళాశాలను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులు, లెక్చరర్ల హాజరు రిజిస్టర్లను పరిశీలించారు.

తపస్ సభ్యత్వ నమోదు


సభ్యత్వ నమోదు చేపడుతున్న నాయకులు

కొండమల్లేపల్లి : పెండింగ్‌లో ఉన్న డీఏ, పీఆర్సీని వెంటనే ప్రకటించాలని తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం(తపస్) జిల్లా ఉపాధ్యక్షుడు కట్టిబోయిన శ్రీనివాస్‌యాదవ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం మండలంలో చేపట్టిన తపస్ సభ్యత్వ నమోదులో ఆయన పాల్గొని మాట్లాడారు. ప్రభుత్వ ఉద్యోగులకు గత రెండు సంవత్సరాలుగా రావాల్సిన డీఏ, పీఆర్సీలను ప్రభుత్వం పెండింగ్‌లో ఉంచిందన్నారు. ఈ కార్యక్రమంలో తపస్ మండల అధ్యక్ష, కార్యదర్శులు కొమిరె సైదులు, బద్దెల అంజయ్య, రవి, శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఆర్టీసీ ప్రగతి చక్ర పురస్కారాలు అందజేత

మిర్యాలగూడ టౌన్ : ఆర్టీసీ ప్రగతిచక్ర పురస్కారాలను మంగళవారం డిపో మేనేజర్ రామ్మోహన్ రెడ్డి అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అంకిత భావంతో విధులు నిర్వర్తించిన సిబ్బందిని ఆయన ప్రత్యేకంగా అభినందించారు. కార్యక్రమంలో ఆర్టీసీ అసిస్టెంట్ మేనేజర్ (ట్రాఫిక్) భారతీబాయి, ఎంఎఫ్ కె.యాదగిరి, జి.నాగమణి, వైష్ణవి, ఎస్.సత్యం ఉన్నారు.


ప్రగతి చక్ర పురస్కారం అందుకుంటున్న సత్యనారాయణ

బీజేపీ మహా సంపర్క్ అభియాన్


కరపత్రాలు పంచి కేంద్ర ప్రభుత్వ పథకాలపై అవగాహన కల్పిస్తున్న బీజేపీ నాయకులు

కొండమల్లేపల్లి : కొండమల్లేపల్లి మండల కేంద్రంలోని బూత్ నెం.119 పరిధిలో మంగళవారం బీజేపీ మహా సంపర్క్ అభియాన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. బీజేపీ మండల ప్రభారీ నక్క వెంకటేష్‌యాదవ్ పాల్గొని మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రజా సంక్షేమ పథకాలపై పార్టీ శ్రేణులు ప్రజలకు వివరించాలని సూచించారు. గడపగడపకు తిరుగుతూ కేంద్ర ప్రభుత్వ పథకాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కౌన్సిల్ సభ్యులు మల్లేష్‌యాదవ్, బూత్ అధ్యక్షులు శ్రీను, యలిజాల శ్రీను, మల్లేష్, రమేష్, చంద్ర, రమేష్‌నాయక్, సయ్యద్‌అలీ పాల్గొన్నారు.

వేణు మృతి పార్టీకి తీరని లోటు


వేణు మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు

వేములపల్లి : మండలంలోని సల్కునూరు గ్రామానికి చెందిన సీపీఎం నాయకుడు నలబోతు వేణు మృతి పార్టీకి తీరని లోటని సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు డబ్బికార్ మల్లేష్ అన్నారు. మంగళవారం వేణు మృతదేహాన్ని సందర్శించి పూలమాలలు వేసి నివాళులర్పించి కుటుంబసభ్యులను పరామర్శించి తన ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేశారు. కార్యక్రమంలో పార్టీ మండల కార్యదర్శి పాదూరి శశిధర్ రెడ్డి, మాజీ వైస్ ఎంపీపీ పాదూరి గోవర్ధని, నాయకులు రెమడాల పరుశురాములు, మద్దిరాల సత్యనారాయణరెడ్డి, రెమడాల భిక్షం, కందుల పెదనాగిరెడ్డి, వడ్డెగాని సైదులు, జెర్రిపోతుల భిక్షం, శ్రవణ్‌కుమార్, వీరస్వామి, సైదులు, రాజు, శ్రీను తదితరులు ఉన్నారు.

క్రీడలతో మానసిక ఉల్లాసం

మిర్యాలగూడ టౌన్ : క్రీడలు మానసిక ఉల్లాసాన్ని, స్నేహాభావాన్ని పెంపొదిస్తాయని మిర్యాలగూడ 5వ అదనపు జిల్లా న్యాయమూర్తి జి.వేణు అన్నారు. పంద్రాగస్టును పురస్కరించుకొని మిర్యాలగూడ బార్ అసోసియేషన్ అధ్యక్షుడు నేతి సత్యనారాయణ ఆధ్వర్యంలో మంగళవారం సీనియర్ సివిల్ జడ్జి సుజయ్, రెండవ అదనపు జూనియర్ జడ్జి అరుణ్‌తేజ్‌తో కలిసి.. జడ్జి జి.వేణు క్రీడా పోటీలను ప్రారంభించి మాట్లాడారు. క్రీడల్లో రాణిస్తేనే సమజంలో మంచి స్థానం ఉంటుందన్నారు. కార్యక్రమమంలో గేమ్స్ కార్యదర్శి కొంక వెంకన్న, ఉపాధ్యక్షుడు శ్రీనివాస్, సహాయ కార్యదర్శి పద్మయ్య, మహిళా కార్యదర్శి గంగా భవాని, కస్తూరి నాగేందర్, ఎండీ.ఇబ్రహీం, జె. శ్రీనివాస్, పరమేష్, రాయరపు భాస్కర్, అలుగుబెల్లి స్వరాజ్యం, ఆస్మా, నాగరాజు, కిరణ్ తదితరులున్నారు.


క్యారమ్స్‌ను ప్రారంభిస్తున్న న్యాయమూర్తి వేణు

నీళ్లున్నా.. అందని సాగునీరు

- కంపచెట్లు, చెత్తాచెదారంతో నిండిన డీ 40కాల్వ
- అడుగంటుతున్న భూగర్భజలాలు
- ఈ సీజన్‌లోనైనా నీరందించాలని రైతుల వేడుకోలు


గుర్రప్పగూడెం గ్రామంలో చుక్క నీరు లేక వెలవెలబోతున్న డీ40 కాల్వ

మాడుగులపల్లి : మండలంలోని డీ40 కాల్వ పిచ్చి మొక్కలు, కంపచెట్లు, వ్యర్థాలు పేరుకపోయి ఉండడంతో నీరు చివరి భూములకు అందే పరిస్థితి కనిపించడం లేదు. ప్రభుత్వం డీ40కాల్వ అభివృద్ధికి నిధులు కేటాయించకపోవడంతో కాల్వలు అధ్వానంగా మారాయి. మండలంలోని చివరి భూములైన మండలంలోని గుర్రప్పగూడెం, సీత్యాతండా, గణపతివారిగూడెం, దేవతలబావిగూడెం, పుచ్చకాయలగూడెం, గొల్లగూడెం, గౌడగూడెం గ్రామాల్లో డీ40 కాల్వ ద్వారా సుమారు 2వేల ఎకరాల వరకు నీరు అందించాల్సి ఉండగా నీటి సామర్థ్యం తక్కువగా వస్తుండడంతో చివరి భూములకు నీరందే పరిస్థితి లేదని, దీంతో ఆయా గ్రామాల్లోని చెరువులు, కుంటలు నిండే పరిస్థితి లేకుండాపోయిందని రైతులు పేర్కొంటున్నారు. అసలే నీటి సామర్థ్యం తక్కువగా ఉండగా దానికి తోడు కాలువలో కంపచెట్లు ఉండడం వల్ల మండల పరిధిలోని భూములకు, చెరువులకు నీరందక రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ప్రభుత్వం, అధికారుల నిర్లక్ష్యం కారణంగా కాల్వకు మరమ్మతులు చేపట్టకపోవడంతో రైతులు తీవ్రంగా నష్టపోయే ప్రమాదం ఉంది. డీ 40 కాల్వ నీరు చివరి భూములకు అందకపోవడంతో భూగర్భజలాలు సైతం ఎండిపోతున్నాయి. దీంతో బోర్లు సైతం పోయలేని పరిస్థితి ఏర్పడడంతో రైతులు దిక్కుతోచని స్థితిలో ఉన్నారు. పరిస్థితి ఇలానే కొనసాగితే నాట్లు వేసిన పొలాలు నిలువునా ఎండిపోయే ప్రమాదం ఉందని ప్రభుత్వం రైతుల ఇబ్బందులను గుర్తించి డీ40 కాల్వలో పిచ్చి మొక్కలు, రాళ్లు తొలగించి నీటి సామర్థ్యాన్ని పెంచి నీటిని వదిలితే చివరి భూములకు నీరంది పంటపొలాలను కాపాడాలని ఆయా గ్రామాల రైతులు వేడుకొంటున్నారు.

డీ37 కాల్వ ప్రారంభం...

డీ 37 కాల్వ నల్లగొండ మండలం గుండ్లపల్లి వద్ద ప్రారంభమై కనగల్, తిప్పర్తి, మాడుగులపల్లి మండలంలోని కన్నెకల్ వరకు సుమారు 27.05 కిలో మీటర్ల వరకు ఉంది. సుమారు 42వేల ఎకరాల్లో ఆయకట్టు నీరందించడంతోపాటు 19చెరువులను నింపేందుకు ప్రభుత్వం ఈ కాల్వ నిర్మాణం చేపట్టింది. మాడుగులపల్లి మండలంలోని గోపాలపురం, మాచినపల్లి, కన్నెకల్, కేశవాపురం గ్రామాల్లోని 3వేల ఎకరాలకు గత సీజన్‌లో నీరు అందించగా ఈ సీజన్‌లో తక్కువ సామర్థ్యంతో నీటిని విడుదల చేయడంతో దిగువకు నీరు అందే పరిస్థితి లేదని రైతులు ఆందోళనలో ఉన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పదించి చివరి భూముల వరకు నీరందేలా చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

రైతులను ఆదుకోవాలి



డీ 37 కాల్వ చివరి భూములకు నీరందించినట్లయితే మా గ్రామంలోని వరి పొలాలకు నీరందుతాయి. డీ 37 కాల్వ ద్వారా సజావుగా నీరందిస్తే చివరి భూముల గ్రామాల్లోని 9 చెరువులు నిండి భూగర్భజలాలు పెంపొందుతాయి. అధికారులు స్పందించి డీ 37కాల్వ ద్వారా సజావుగా నీరందించి రైతులను ఆదుకోవాలి.

- చింతరెడ్డి భాస్కర్‌రెడ్డి, రైతు, ధర్మాపురం

చివరి భూములకు నీరందడం లేదు



కాల్వ చివరి భూములకు నీరందడం లేదు. పోయిన యాసంగి సీజన్‌లో వరి పొట్టదశలో నీళ్లివ్వకపోవడంతో పశువులను మేపుకునే పరిస్థితి ఏర్పడింది. నా మూడెకరాల పొలాన్ని పశువులను మేపినాం. దీంతో నేను రూ.50వేల వరకు నష్టపోయా. ఈసారైనా ప్రభుత్వం, అధికారులు చివరి భూములకు నీరందిస్తే పొలాలు ఎండిపోకుండా ఉంటాయి.

- లచ్చుంనాయక్, రైతు, సీత్యాతండా

చివరి భూములకు నీరందిస్తాం

ప్రస్తుతం డీ 40 కాల్వకు నీటి సామర్థ్యం తక్కువగా వస్తుంది. వారబంధి కారణంగా చివరి భూములకు నీరందడం లేదు. వచ్చే వారం వరకు నీటి సామర్థ్యాన్ని పెంచి చివరి భూములకు కూడా నీరందిస్తాం. అలాగే కాల్వలను మరమ్మతులు చేయిస్తాం.

- వజహతుల్లా డీ40, ఏఈ